
క్లుప్తంగా

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్ (రెంటచింతల): స్థానిక షిరిడీ సాయి ఆలయంలో గురువారం ఆలయ అర్చకుడు గోపాల్ పాండే ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భజన బృందం వారు బాబా గీతాలను ఆలపించారు. దేవస్థానం చైర్మన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు

మాచర్ల: మాచర్ల పురపాలక సంఘ పరిధిలో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు గురువారం తెలిపారు. శుక్ర, శనివారాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇక్కడ సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదలకు అన్నదానం



మాచర్ల: స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యాన్నదానం కొనసాగుతున్నట్లు ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి గురువారం తెలిపారు. ప్రతిరోజు రద్దీ ప్రాంతాల్లో పేదలకు మూడు పూటలా ఆహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మూగ జీవులకు కూడా ఆహారం పెడుతున్నట్లు చెప్పారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో సేవలు చేస్తున్నట్లు వివరించారు. దాతలు సహాయ, సహకారాలు అందించాలని ఆయన కోరారు.

105 మందికి వైద్య సేవలు



పిడుగురాళ్ల రూరల్: క్యాన్సర్ శరీరంలో ఏ భాగంలోనైనా రావచ్చునని పిడుగురాళ్ల ఆరోగ్య కేంద్ర వైద్యురాలు రమాదేవి అన్నారు. మండలంలోని పందిటివారిపాలెం గ్రామంలో స్వస్థ్ నారీ – సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... క్యాన్సర్‌కు ధూమపానం, మద్యపానం, పౌష్టికాహార లోపం, అధిక బరువు వంటివి కారణాలు అని పేర్కొన్నారు. ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకోవటం వలన ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఆమె తెలిపారు. అనంతరం రోగులను పరిశీలించారు. 105 మందికి వైద్య సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు నాగభూషణం, మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, ఏఎన్ఎం జానీమీరా తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ముఖ్యం



పిడుగురాళ్ల: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వాకింగ్ ట్రాక్ ప్రాంతంలో వంద మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇందులో చైర్మన్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ... మొక్కలను పెంచితే స్వచ్ఛమైన గాలి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసులు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కోట రమేష్, సెక్రటరీ పచ్చిపులుసు పాపయ్య గుప్తా, ట్రెజరర్ ఊటుకూరి గురునాథం, డిస్ట్రిక్ట్ అవార్డు చైర్ డాక్టర్ పి.విష్ణుబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను శుభ్రం చేసిన అధికారులు



మాచర్ల: మాచర్ల మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని పురపాలక సంఘ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.బి.చారిలు నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్కలు నాటారు. రోడ్లను అధికారులు శుభ్రం చేశారు. రోజుకో ప్రాంతంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు కార్యక్రమం జరిగింది. పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యత గురించి డాక్టర్ కె.బి.చారి వివరించారు. మున్సిపల్ చైర్మన్ మదార్ సాహెబ్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



పిడుగురాళ్ల: వెంకటేశ్వర ఆలయంలో కుంకుమ పూజలో మహిళలు



పిడుగురాళ్ల: గంగమ్మ ఆలయంలో కుంకుమ పూజలో భక్తులు



పిడుగురాళ్ల: మహాలక్ష్మి ఆలయం వద్ద కుంకుమ పూజ

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



రెంటచింతల: సత్రశాలలో కాత్యాయనిగా భ్రమరాంబికాదేవి



మాచవరం: శివాలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



కారెంపూడి: కాత్యాయని అలంకారంలో అంకాలమ్మ



రెంటచింతల: పాలువాయి జంక్షన్‌లో అన్నపూర్ణాదేవిగా కనకదుర్గమ్మ



పిడుగురాళ్ల: బ్రహ్మంగారి గుడిలో సరస్వతీదేవిగా అమ్మవారు

రెంటచింతల/పిడుగురాళ్ల/మాచవరం/కారెంపూడి: మండల కేంద్రమైన రెంటచింతలలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. పలు వీధులలో ప్రత్యేక పందిళ్లు ఏర్పాటు చేసి అమ్మవారిని కొలువుదీర్చారు. భక్తి శ్రద్ధలతో వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాలలోని అమ్మవారి ఆలయాలలో విశేష పూజలు జరిగాయి. అమ్మవార్లు వివిధ అలంకారాలలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజాము నుంచి అభిషేకాలు జరిగాయి. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. రాత్రి 8 గంటల నుంచి ఆలయాల ఆవరణలో నిర్వహించిన బతకమ్మ వేడుకలలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఆలయాలను విద్యుత్ తోరణాలతో అందంగా ముస్తాబు చేశారు.

పిడుగురాళ్లలో..

పిడుగురాళ్ల పట్టణంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మంగారి దేవాలయంలో సరస్వతీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. గంగమ్మ ఆలయంలో కుంకుమ పూజల్లో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యసాయి దేవాలయంలోని అమ్మవారిని సలిబండితో ప్రత్యేకంగా అలంకరించారు. జానపాడు రోడ్డులోని వాసవి కన్యకాపరమేశ్వరిని హిమవర్దినిగా అలంకరించారు. తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న వెంకటేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారిని నరసింహ అవతారంలో అలంకరించారు. అనంతరం మహిళలు పెద్ద సంఖ్యలో కుంకుమ పూజ నిర్వహించారు. కనకదుర్గ గుడిలోని అమ్మవారిని కాత్యాయనిగా అలంకరించారు. మాయాబజార్‌లో మహాలక్ష్మి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళాభక్తులు కుంకుమ పూజ చేశారు.



కారెంపూడి: శివారెడ్డి ఇంటి బజారులో పూజలు అందుకుంటున్న అమ్మవారు



మాచవరం: శ్రీ వాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బాలాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు

మాచవరంలో...

మాచవరం మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. చెన్నాయపాలెం గ్రామంలోని శ్రీ రేణుక అమ్మవారు మహిషాసుర మర్ధినిగా గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. మాచవరంలోని శ్రీ భ్రమరాంబిక సమేత చెన్న మల్లేశ్వర స్వామి దేవాలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు కొలువుదీరారు. శ్రీ వాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శ్రీ లలితాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కారెంపూడిలో...

కారెంపూడి పరిధి పల్నాటి వీర్ల అంకాలమ్మను గురువారం కాత్యాయనీదేవిగా అలంకరించారు. వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ దంపతులతోపాటు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు ప్రత్యేక పూజలు చేశారు. యన్నం శివారెడ్డి ఇంటి ప్రాంగణంలో ఆ ప్రాంత మహిళలు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కారెంపూడిలోని చెన్నకేశవ స్వామి ఆలయం తదితర చోట్ల కూడా దసరా ఉత్సవాలు వైభవంగా సాగాయి.

జాషువా ఆశయాలను కొనసాగించాలి

పిడుగురాళ్ల: కవి జాషువా ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని రిటైర్డ్ జడ్జి కూచిపూడి ప్రసాదరావు అన్నారు. పట్టణంలోని లెనిన్ నగర్‌లో కార్ప్ సంస్థ ఆధ్వర్యంలో జాషువా జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కార్ప్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్‌నాథ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశం గరివ్వించదగ్గ కవి జాషువా అని, జాషువా రచనలు సామాజిక మార్పులకు దోహదం చేశాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఏపీపీ పరిసపోగు సునీల్, కృష్ణ జిల్లా సీనియర్ కవి పి.అనిల్, బలహీన వర్గాల పల్నాడు అధ్యక్షులు నల్లబోతుల రాజు, జెట్టిపోగు ఏసురత్నం, అశోక్‌బాబు, దేగల అబ్రహాం, స్కూల్ హెచ్ఎం పి.లత, పి.దయామణి, ఎల్.కీర్తన, ఎస్‌కే రహీం, సురేష్, చందు, అన్నారావు పాల్గొన్నారు.

'స్వచ్ఛ గురజాల'కు సహకరించండి



గురజాల : ప్రతి ఒక్కరూ స్వచ్ఛ గురజాలకు సహకరించాలని నగర పంచాయతీ చైర్మన్ షేక్ బడే జానీ అన్నారు. నగర పంచాయతీలోని పలు వార్డుల్లో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మన ఊరు – మన పరిశుభ్రత అనే నినాదాన్ని గుర్తుంచుకోవాలని కోరారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కమిషనర్ పి.శివన్నారాయణ, కౌన్సిలర్ నేలవల్లి బొల్లయ్య, కె.అంకారావు, పోటు నాగేశ్వరరావు, పిచ్చయ్య గుప్తా, లింగేశ్వరరావు, బషీర్, మహబూబ్ బాషా, సుందరగిరి నజీమూన్, హమీద్ తదితరులున్నారు.

చేనేత వస్త్రాలను ప్రోత్సహించాలి

చిలకలూరిపేట: చేనేత వస్త్రాలను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. పట్టణంలోని కృష్ణమహల్ సెంటర్‌లో ఉన్న సింగు మినీ ఫంక్షన్ హాలులో బీజేపీ ఆధ్వర్యంలో చేనేత వస్త్ర ప్రదర్శన గురువారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ విదేశీ వస్తువులు వద్దు, స్వదేశీ వస్తువులే ముద్దు అనే నినాదంతో చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభించటం అభినందనీయమన్నారు. బీజేపీ అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాశ్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు

వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే కాసు



శాలువాతో సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు

గురజాల రూరల్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకునికి తగిన గుర్తింపు ఎల్లప్పుడూ ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. ఇటీవల నియామకాల్లో పార్టీకి సంబంధించి వివిధ పదవులు పొందిన పలువురిని స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వచ్చేలా శ్రమించాలని సూచించారు. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అన్యాయాలను, అరాచకాలను ప్రజలకు తెలియచేసేలా ముందుకు సాగాలన్నారు. ఐక్యంగా ముందుకు సాగి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పెదకూరపాడు, వినుకొండ నియోజకవర్గాల పరిశీలకుడు యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), మండల కన్వీనర్ కొమ్మినేని బుజ్జి, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, షేక్ పీర్ అహ్మద్, కర్రా చినకోటేశ్వర రావు, కె.అంద్రెయ్య తదితరులు ఉన్నారు.

బాధితుడిని ఆదుకోవాలని డిమాండ్



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పిడుగురాళ్ల: విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నష్టపోయిన వ్యక్తిని ఆదుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కారంపూడి మండలం పెద కొదమగుండ్ల గ్రామంలో సాగర్‌బాబును బలవంతంగా స్తంభంపైకి ఎక్కించడంతో విద్యుదాఘాతానికి గురై కింద పడి కాళ్లు, చేతులు కోల్పోయాడని చెప్పారు. విద్యుత్ శాఖ లైన్‌మెన్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ లైన్‌మెన్ పరబ్రహ్మంచారి, ఏఈలు దీనికి కారణమని ఆరోపించారు. నేటికీ బాధితుడికి న్యాయం జరగలేదని వాపోయారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి శ్రీను, సీపీఐ మండల కార్యదర్శి బాలయ్య, ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి ఓర్స్ కృష్ణ, అంబేద్కర్ ప్రచార సమితి అధ్యక్షుడు దేగల అబ్రహాం, మాల మహానాడు నేత గోదా బాల, కె.కుమార, పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, ప్రసాదు, మాల మహానాడు నాయకురాలు చిట్టిమల్ల మేరి, జి. కీర్తన, ఎస్. పద్మ పాల్గొన్నారు.

శావల్యాపురంలో వైద్యశిబిరం

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం అంబేడ్కర్ విగ్రహం ప్రధాన కూడలి మార్గంలో బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు గట్టుపల్లి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ భారతదేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన మహోన్నత వ్యక్తులను గుర్తు చేసుకోవటం మంచి శుభాపరిణామన్నారు. అనంతరం వైద్య శిబిరంలో 50 మంది రోగులకు బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రావిపూడి రమ్య, ఆరోగ్య కార్యకర్త లింగాల శ్రీలలిత, తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



యడ్లపాడు: 16వ నంబర్ జాతీయ ఎక్స్‌ప్రెస్ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. హైవే భద్రతా సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెంకు చెందిన కోరప్రాటి కోటేశ్వరరావు చిలకలూరిపేట నుంచి తన స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వినుకొండ – హైదరాబాద్ మార్గంలో వేగంగా వెళ్తున్న కారు మండలంలోని వంకాయలపాడు వద్దకు రాగానే వెనుక టైరు ఒక్కసారిగా పగిలిపోయింది. దీంతో వేగంలో ఉన్న కారు అదుపుతప్పి కారు ముందు వెళ్తున్న కోటేశ్వరరావు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ పాక్షికంగా దెబ్బతినగా, కోటేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే భద్రతా సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిన కోటేశ్వరరావును కోండ్రుపాడులోని కేఎంసీ బోధనాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు పోలీసులు విచారణలో తెలియాల్సి ఉంది.

'ఎస్ఎస్ఎన్'లో ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

నరసరావుపేట ఈస్ట్: పేద, మధ్యతరగతి విద్యార్థుల అభ్యున్నతే ధ్యేయంగా శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్థాపించబడిందని కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త స్పష్టం చేసారు. కళాశాల ఆడిటోరియంలో గురువారం డిగ్రీ విద్యార్థుల ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా కళాశాలలో అడుగిడిన విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలనతో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. ఈసందర్భంగా విద్య, క్రీడా, సాంస్కృతిక రంగాలలో ప్రతిభ గల విద్యార్థులకు బహుమతులు అందించారు. కళాశాల జాయింట్ సెక్రటరీ ఊటుకూరి వెంకటఅప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు, కమిటీ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రల సేవలు వెలకట్టలేనివి



క్లాప్‌మిత్రలను సన్మానిస్తున్న ఎంపీడీఓ ఉమాదేవి

నూజెండ్ల: గ్రామాలు పరిశుభ్రంగా ఉంచటంలో క్లాప్ మిత్రలు (పారిశుద్ధ్య కార్మికులు) ప్రధాన పాత్ర పోషిస్తున్నారని ఎంపీడీఓ ఉమాదేవి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నూజెండ్ల, ఉప్పలపాడు, జడ్డావారిపాలెం, చెరుకుంపాలెం, గ్రామ సచివాలయంల్లో గురువారం క్లాప్‌మిత్రలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణే కాకుండా కార్మికులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం గ్రామాల సర్పంచ్‌లతో కలిసి శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణ, సొసైటీ పర్సన్ బచ్చు అంజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రవీంద్రబాబు, రామకృష్ణ, లాలు, స్వచ్ఛ భారత్ మండల కో–ఆర్డినేటర్ సుబ్బరామయ్య, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య మెరుగులో భాగస్వాములు కావాలి

చిలకలూరిపేట: పారిశుద్ధ్య మెరుగులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీలో ఉన్న మున్సిపల్ పార్కులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఏక్‌దిన్ ఏక్ ఘంట ఏక్ సాత్ పేరుతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీని ఉద్దేశం రోజులో ఒక గంట పారిశుద్ధ్యం కోసం కేటాయించాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తుందన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులతో కలసి పార్కును ఊడ్చి, గ్రాస్ కట్టర్‌తో గడ్డిని తొలగించారు. కమిషనర్ పి.శ్రీహరిబాబు, డీఈఈ షేక్ అబ్దుల్ రహీం, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రమణారావు, సునీత, కౌన్సిలర్లు సిబ్బంది పాల్గొన్నారు.

శావల్యాపురం: స్వచ్ఛ భారత్‌పై ప్రజల్లో చైతన్యం పెంపొందించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో పి.సుగుణ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో మండల స్థాయి అధికారుల సారథ్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచులు బీర్నేడి రత్నగిరి, మద్దినేని ఆంజనేయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత పాల్గొన్నారు.

గ్రామాల్లో పోషణ మాసోత్సవాలు



యడ్లపాడులో గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న సీడీపీఓ శాంతకుమారి

యడ్లపాడు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని యడ్లపాడు ఎంపీడీఓ వి.హేమలతా దేవి తెలిపారు. నాదెండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం యడ్లపాడులో నిర్వహించిన మండలస్థాయి పోషణ మాసోత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడుతూ.. మంచి ఆరోగ్యం కోసం రసాయన ఎరువులు లేని సేంద్రీయ ఆహారాన్ని తీసుకోవడం ఉత్తమమని, ప్రతి ఒక్కరు తమ ఇంటి పెరట్లో చిన్నపాటి పెరటి తోటలు పెంచుకోవాలని సూచించారు. సీడీపీఓ జి.శాంతకుమారి మాట్లాడుతూ.. పిల్లల ఆరోగ్యం, ఎదుగుదలకు పోషకాహారం ఎంత ముఖ్యమో వివరించారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసనలు నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు పోషకాహారంతో కూడిన వంటల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ వెంకయ్య, ప్రథమ్ జిల్లా కో–ఆర్డినేటర్ ఎం.వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి శశికళ, ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్స్ కె.వెంకటరమణ, ఆర్.సామ్రాజ్యం, వి.అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, తల్లులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చిలకలూరిపేటటౌన్: విద్యార్థులు ఉద్యోగాల అన్వేషణ కాదు.. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పల్నాడు జిల్లా ఇండస్ట్రీస్ సెంటర్ ఆఫీసర్ ఎం.నవీన్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని డీఆర్ఎన్ఎస్‌సీవీఎస్ కళాశాలలో గురువారం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవేర్‌నెస్ ప్రోగ్రాం జరిగింది. విశాఖపట్నం అసిస్టెంట్ డైరెక్టర్ డి.వీరయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసి కొత్త వ్యాపారాలు ప్రారంభించాలని సూచించారు. స్వయం ఉపాధి, పరిశ్రమలు స్థాపించడానికి ప్రభుత్వం అందిస్తున్న ఎంఎస్ఎంఈ, డీపీసీ, రాంప్, ముద్ర వంటి పథకాల గురించి వివరించారు. ఆయా పథకాలను సద్వినియోగం చేసుకునే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.